పైప్‌లైన్ పనుల ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్

మేడ్చల్: పట్టణంలోని మూడోవార్డు రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ జాకట దేవతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లుగా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించామని పదవులు ఉన్నా లేకున్నా నిత్యం ప్రజాసేవలోనే ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో నాయకులు

మేడ్చల్: బీజేపీ యువ నాయకులు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ , నాయకుడు వేముల అభిలాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'యంగ్ ఇండియా కే బోల్' షురూ



పోస్టర్ విడుదల చేస్తున్న పొన్నం తరుణ్ గౌడ్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని కాచవాని సింగారంలో 'యంగ్ ఇండియా కే బోల్' కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్ సోమవారం ప్రారంభించి, పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూత్ వాయిస్ వినిపించడమే 'యంగ్ ఇండియా కే బోల్' లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మకు అజయ్, ప్రధాన కార్యదర్శి బండ్లగూడ క్రాంతి గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు తోటకూర రాహుల్, ఘట్‌కేసర్, పోచారం మున్సిపల్ అధ్యక్షులు సంజీవరెడ్డి, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జవహర్‌నగర్: కేసీఆర్‌నగర్ కాలనీవాసుల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ సోమవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, రాజుయాదవ్, భాస్కర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి..

మేడిపల్లి: అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఓ వ్యక్తిని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ గౌతమ్‌నగర్‌కు చెందిన కె.మల్లారెడ్డి సర్వేనెంబర్-63/28లో సిమెంటు రేకుల షెడ్డు నిర్మించుకుని కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. కాగా ఈనెల 25న రాత్రి 7.30 గంటల సమయంలో స్థానికంగా ఉంటున్న శశి, జొన్న రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, వేణు కొంత మందితో కలిసి అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దుర్భాషలాడుతూ.. సదరు ఇంటి యజమానిపై దాడికి పాల్పడ్డారు. విద్యుత్ మీటర్, బట్టలకు నిప్పంటించడంతో తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. బాధితుడు మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో కారుతో ఢీ..

కుషాయిగూడ: మద్యం మత్తులో ఓ వ్యక్తి ముందు వెళ్తున్న కారును ఢీకొట్టిన ఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. మేడిపల్లి పీఎన్‌టీ కాలనీలో నివసించే భూక్యా నెహ్రూ క్యాబ్‌ను అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున కుషాయిగూడలో ప్యాసింజర్‌ను ఎక్కించుకుని వెళ్తుండగా.. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన (టీఎస్36టీ 7871) కారు ఢీకొట్టడంతో క్యాబ్ డివైడర్‌కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతిన్నది. దీంతో బాధితుడు కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాయకులకు విరామం ఉండదు

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- ఘట్‌కేసర్ మున్సిపల్ పాలకవర్గానికి వీడ్కోలు, సన్మానం



ఘట్‌కేసర్ మాజీ చైర్‌పర్సన్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీ ఈటల



దమ్మాయిగూడ మున్సిపల్ పాలకవర్గాన్ని సన్మానించిన కమిషనర్

ఘట్‌కేసర్: పదవులకే విరామం ఉంటుందని, నాయకులకు కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. స్థానిక నారాయణ గార్డెన్‌లో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిల్ సభ్యులకు సోమవారం వీడ్కోలు, సన్మాన సభ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరైన వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రజలను కాపాడిన ఘనత నాయకులేదన్నారు. ఉత్తర తెలంగాణకు ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్ ముఖద్వారమని ఎంపీగా గెలిపించినందుకు రుణపడి ఉంటానన్నారు. మాజీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కుటుంబం, కౌన్సిల్ సభ్యులు, ప్రజల సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేశామన్నారు. పారిశుద్ధ్య కార్మికుల శ్రమ కారణంగానే రెండుసార్లు వరుసగా జాతీయ అవార్డులు సాధించామని, ఈ ఘనత వారికే దక్కుతుందన్నారు. మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి మాట్లాడుతూ.. పదవి లేకపోయిన ప్రజల మధ్యే ఉంటానన్నారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధా, నస్రీన్ సుల్తానా, నాగజ్యోతి, మల్లేశ్, వసంత, హేమలత, నరేశ్ యాదవ్, జహంగీర్, రవీందర్, కోఆప్షన్ సభ్యులు సురేందర్‌రెడ్డి, అరుణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

దమ్మాయిగూడ మున్సిపల్ పాలకవర్గం..

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఏ. నాగమణి అధ్యక్షతన సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాజామాజీ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ మాట్లాడుతూ.. మున్సిపల్‌లో సమస్యల పరిష్కారానికి సహకరించిన సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యే మల్లారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాజీచైర్‌పర్సన్‌తో పాటు, కౌన్సిలర్లను సత్కరించారు. కార్యక్రమంలో డి.ఈ. ఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, మాజీ కౌన్సిలర్లు నానునాయక్, నాగయపల్లి సుజాత, కొత్త హేమలత, వెంకటేశ్, స్వప్నహరిగౌడ్, సరిత వెంకటేశ్, వెంకటరమణ, రమేశ్‌గౌడ్, నర్సింహారెడ్డి, మోర మౌనిక నరహరిరెడ్డి, రామారం శ్రీహరిగౌడ్, కో ఆప్షన్‌సభ్యులు వహీదాబేగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ లేకున్నా ప్రజా సేవ చేయాలి

మేడ్చల్: పదవీ కాలం ముగిసినా కౌన్సిలర్లు నిత్యం సేవ చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పాలకవర్గం చివరి రోజు సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పాల్గొని మాట్లాడుతూ.. ప్రజాభిమానం ఉండే నాయకులే చట్టసభలకు తిరిగి ఎన్నికవుతారని అన్నారు. అనంతరం చైర్ పర్సన్, కౌన్సిలర్లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానించిన ఎమ్మెల్యే..

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులతో ఎమ్మెల్యే మల్లారెడ్డి తన నివాసంలో సన్మానించి అభినందించారు.



గురుకులాన్ని అభివృద్ధి చేయాలని లేఖలు



ఘట్‌కేసర్‌లో లేఖలు ప్రదర్శిస్తున్న యాదగిరియాదవ్, నాయకులు

ఘట్‌కేసర్: గురుకులాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ స్థానికుల కోరిక మేరకు మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, 107 మంది ఎమ్మెల్యేలు, 12 మంది మంత్రులకు లేఖలు పంపారు. స్థానిక గురుకుల కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలలను గురుకుల పాఠశాలలో విలీనం చేసి, 26 ఎకరాల విస్తీర్ణం గల గురుకులంలో ఆయా పాఠశాలలను ఏర్పాటు చేసి 'శ్రీ బన్సీలాల్ వ్యాస్‌జీ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల'గా నామకరణం చేయాలన్నారు. అలాగే సదరు స్కూళ్ల ప్రదేశంలో విశాలమైన బస్టాండ్‌ను నిర్మించాలని లేఖలో పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు ప్రేమ్‌కుమార్, వెంకటేశ్, ఆంజనేయులు, శశిధరన్, నాగేశ్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌యాదవ్, సురేశ్, అధ్యాపకులు, స్థానికులు ఉన్నారు.

నవంబర్‌లోగా హైవే పనులు పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

మేడ్చల్: నగరంలోని బోయిన్‌పల్లి నుంచి మెదక్ జిల్లా కాళ్లకల్ వరకు చేపట్టిన 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు వచ్చే నవంబర్‌లోగా పూర్తి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అధికారులు, బీజేపీ నాయకులతో కలిసి మేడ్చల్ పరిధిలో విస్తరణ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. రోడ్డు విస్తరణతో వాహనదారులు ఇబ్బందులు పడకుండా కాంట్రాక్టర్, అధికారులతో కలిసి పని చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పోలీసులు చూడాలని సూచించారు. వాహనదారుల ఇబ్బందులు తొలగించేందుకే కేంద్ర ప్రభుత్వం రూ.1000 కోట్ల నిధులతో జాతీయ రహదారి విస్తరణ, అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, శైలజ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి మహిళా కళాశాలలో ఈ–సమ్మిట్ 2 కే 25 షురూ



సమ్మిట్‌లో శాలినీరెడ్డి, ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ–సమ్మిట్ 2 కే 25 సోమవారం ఘనంగా జరిగింది. టీజీబీసీ హైదరాబాద్ ప్రతినిధి సాహిల్ సుమన్, మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ శాలినీ రెడ్డి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సైబర్‌సెక్యూరిటీ సీఈఓ శ్రీరామ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవస్థాపక స్వరాలను ఒక్కచోటికి చేర్చి విజయవంతమైన స్టార్టప్ వాయిస్‌ల అనుభవాలతో అభివృద్ధి చెందుతున్న ఎంటర్‌ప్రెన్యూర్‌ల సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలకు, విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారేందుకు ఈ సమ్మిట్ కృషి చేస్తుందన్నారు. అలాగే 35 మంది పారిశ్రామికవేత్తలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- అధికారులతో సమీక్షా సమావేశం

సాక్షి సిటీ బ్యూరో: ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. తన చాంబర్ లో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 5 ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. అలాగే ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు రెండు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ఇంటర్ జనరల్ కు సంబంధించి 1,24,115 మంది, ఒకేషనల్ 2,308 మంది మొత్తం 1,26,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 150 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అలాగే మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలని, బందోబస్త్ చేపట్టాలని పోలీసులతో ఆయా శాఖ అధికారులకు సూచించారు. కేంద్రాల నుంచి జవాబు పత్రాలను పకడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని, విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, కళాశాలల ప్రిన్సిపాల్స్, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం



కీసర: సీపీఎస్‌కు బదులుగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూనైటెడ్ పెన్షన్‌స్కీమ్ యూపీఎస్ (గెజిట్ విడుదల)ను వ్యతిరేకిస్తూ సోమవారం భోజన విరామ సమయంలో పీఆర్టీయూ టీఎస్ కీసర మండలాధ్యక్షుడు చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీగా వెళ్లి కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, కె.శ్రీనివాసులు, తిరుమల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జ్యోత్స్న, శశిరేఖ, కొండల్, ముత్యం, వెంకటరమణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



పోచారం: నారపల్లిలోని అంజని స్కూల్ టాపర్ విద్యార్థిని చింతలపూడి చందనకు ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి అండగా నిలిచారు. ఆమె ఉన్నత చదువుల కోసం రూ. 50 వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి చింతలపూడి శ్రీధర్, ఉపాధ్యాయ బృందం, టీం ఎస్ఎస్ఆర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డబీల్‌పూర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి

మేడ్చల్: మండలంలోని అతిపెద్ద డబీల్‌పూర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో సోమవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. సమీప గ్రామాలను కలిపి డబీల్‌పూర్‌ను మున్సిపాలిటీగా మార్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

సుభాష్‌నగర్: చికిత్స పొందుతూ మహిళా మృతి చెందింది. అయితే వైద్యుల నిర్లక్ష్యంమే కారణమంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. స్థానికుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట బేకరీగడ్డకు చెందిన కరీమా (29)కు నాలుగు నెలల క్రితం సూరారంలోని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రిలో గాల్ బ్లాడర్ సర్జరీ జరిగింది. ఆదివారం తాత్కాలిక యూరిన్ పైప్ తొలగించాలని ఆస్పత్రికి వచ్చింది. ఈ క్రమంలో యూరిన్ పైప్ తొలగించి మహిళను ఇంటికి పంపించారు. ఇంటికి వెళ్లిన మహిళ ఆరోగ్యం క్షీణించడంతో తిరిగి ఆస్పత్రిలో చేర్పించగా.. కొద్ది సేపటికే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లబోమని భీష్మించుకు కూర్చున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నది.

ప్రజావాణికి 5 ఫిర్యాదులు



మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి 5 ఫిర్యాదులు అందాయని డీసీ రాజు అన్నారు. ప్రజావాణిలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో దోమల బెడద అధికంగా ఉందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు జారీ చేయాలన్నారు. చాలా మంది అర్హుల వివరాలు నమోదు కాకపోవడంతో వారు ఏ పథకానికి అర్హులో తెలుసుకునేందుకు కష్టంగా మారిందన్నారు. ఎడిట్ ఆప్షన్ ద్వారా వారికి తెలిసేలా చేయాలని కోరామన్నారు.

అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన సభ



కీసర: నాగారం మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో మున్సిపల్ బీఆర్. అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పాలకవర్గ సభ్యులకు ఆత్మీయ అభినందన, సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ తాజామాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఇకపై కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేశ్, కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, వంగ హరిబాబు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పంగ ముత్యాలు, మాజీ వార్డు సభ్యులు సాయినాథ్‌గౌడ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు లింగం, బాల్‌నర్సింహ, నిమ్మల రవి, ఉద్దేమరి సోమన్న వామన్‌రావు, ఆంజనేయులు, మల్లేశ్, బాబు, విద్యాసాగర్, సతీశ్, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పోచారం: వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. నగరంలో ‘లక్ష డప్పులు–వేయిగొంతుకలు’ పేరిట ఫిబ్రవరి 7న నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్నోజిగూడలోని శివాస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సన్నాహక సభ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సమానంగా పంచుకోవాల్సిన రిజర్వేషన్ వాటాలను ఏకపక్షంగా అనుభవించడం విచారకరమన్నారు. అందుకే న్యాయపరమైన వాటా కోసం కదలి రావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మందకృష్ణను కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

అల్వాల్/మల్కాజిగిరి: నియోజకవర్గంలో నమోదైన అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని దళిత సంఘాలు, బీఆర్‌ఎస్ నేతలు ఆర్డీఓ శ్యామ్‌ప్రకాశ్‌ను కోరారు. సోమవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఆర్డీఓ అధ్యక్షతన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నెరేడ్‌మెట్‌లో జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అల్వాల్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ కరమ్‌చంద్‌పై జరిగిన దాడి కేసులో ఆధారాలు లేవని పోలీసులు కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థికసాయం లోనూ జాప్యం జరుగుతోందని దాన్ని అరికట్టాలన్నారు. దళితులకు కులధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేస్తున్నారని, ఆరో మాల కులస్తులకు త్వరితగతిన సర్టిఫికెట్లు అందేలా చూడాలన్నారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటేశ్, అశోక్, రాములు, స్థానిక నేతలు అంజయ్య, కరమ్‌చంద్, జగదీష్‌గౌడ్, గంగాధర్‌కృష్ణ, గణేష్, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ



గుండ్లపోచంపల్లి ప్రత్యేకాధికారి రఘుప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం



తూంకుంట మున్సిపల్ ప్రత్యేకాధికారి సంధ్యకు..

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. దీంతో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ సీ.ఎన్ రఘు ప్రసాద్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ స్వామి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది ఆయనను సత్కరించారు. అలాగే తూంకుంట మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా జేడీఎంఏ సంధ్య బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ వెంకటగోపాల్ శాలువాతో ఆమెను సత్కరించారు అనంతరం ప్రత్యేకాధికారులు మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా సంధ్య..



ప్రత్యేకాధికారి సంధ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ డాకునాయక్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా సంధ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ డాకునాయక్ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పోచారం ప్రత్యేకాధికారిగా శ్రీనివాసరెడ్డి..

పోచారం: పోచారం మున్సిపల్ ప్రత్యేకాధికారిగా మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కమిషనర్ వీరారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ వీరారెడ్డి